ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శుక్రవారం 17 జనవరి 2025



11 మందికి.. పదవీ గండం..!





- మంత్రుల తీరుపై అధిష్టానానికి నివేదిక
- సూర్జేవాలాకు అందించిన సీఎం, డీసీఎం
- రెండు, మూడు రోజుల్లో వేటు తప్పదా..?
- కేబినెట్ ప్రక్షాళనకే పార్టీ నిర్ణయం



బెంగళూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలాకు మంత్రుల పనితీరుపై నివేదిక అందజేసిన సంగతి తెలిసిందే. 20నెలల కాంగ్రెస్ పాలనలో మంత్రులుగా వ్యవహరించిన 11మంది శాఖలపై పట్టు సాధించకపోవడం, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులుగాను పనితీరు ఏమాత్రం సంతృప్తి లేదనే రీతిలో పార్టీ అధిష్ఠానానికి నివేదిక చేరింది. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ సీల్డ్‌కవర్‌లో నివేదిక సమర్పించారు. బెంగళూరులో పాల్గొన్న సభలో నివేదికను అందించారు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ఇందిరాగాంధీ భవన్ ప్రారంభం బిజీలో అగ్రనేతలు ఉన్నందున మరో రెండు మూడురోజులు నివేదికపై ఎటువంటి పరిణామాలు ఉండవనిపిస్తోంది. ఆ తర్వాత నివేదికను సమగ్రంగా పరిశీలించి వారిపై వేటు వేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి 8 నెలల క్రిందటే అధిష్ఠానం ఏడాది పాలనలో మంత్రుల తీరుపై నివేదిక కోరగా సమగ్ర వివరాలతో పంపారు. అయితే లోక్‌సభ ఎన్నికలు, రాష్ట్రంలో మూడు శాసనసభ స్థానాలకు ఉప ఎన్నికలు ఉన్నందున ఆ నివేదికపై ఎటువంటి చర్యలు లేకుండా పెండింగ్‌లో పెట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎటువంటి ఎన్నికలు లేకపోవడం, ఇటీవల నాయకత్వ మార్పు అంశం తెరపైకి రావడంతో నయానా భయానా అందరిని కట్టడి చేసేందుకు అధిష్టానం కేబినెట్ ప్రక్షాళన చేయదలిచినట్లు తెలుస్తోంది. అందుకే నివేదికను కోరినట్లు సమాచారం. మూడు నెలలక్రిందటే ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ బెంగళూరు పర్యటనలో మంత్రివర్గ ప్రక్షాళన అంశాన్ని ప్రస్తావించారు. ఆ తర్వాత రాజకీయంగా చోటు చేసుకున్న కొన్ని పరిణామాలకు అనుగుణంగా నివేదిక కోరినట్లు సమాచారం. 11మంది మంత్రుల తీరు సరిగా లేదని నివేదికలో తేల్చినట్లు సమాచారం. ఆశాజనకంగా లేని మంత్రుల జాబితాలో విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప, పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రి కెహెచ్ మునియప్ప, ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, మత్స్య, ఓడరేవులశాఖ మంకాళవైద్య, హజ్, పాలనా వ్యవహారాలు రహీం ఖాన్, చిన్నతరహా పరిశ్రమలశాఖ శరణ బసప్ప దర్శనాపుర, పశుసంవర్ధక, పట్టుశాఖల మంత్రి కే వెంకటేశ్, చిన్ననీటి పారుదలశాఖ మంత్రి ఎన్ఎస్ బోసరాజు, చెరుకు, జౌళి, ఏపీఎంసీల మంత్రి శివానందపాటిల్, అబ్కారీశాఖ మంత్రి ఆర్‌బి తిమ్మాపుర, గణాంకాలశాఖ మంత్రి డి సుధాకర్‌ల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. రాష్ట్ర కేబినెట్‌లో ఎమ్మెల్సీ కోటాలో మంత్రిగా కొనసాగుతున్నది బోసరాజు ఒక్కరే. పార్టీ సీనియర్ నేత బీకే హరిప్రసాద్‌కు మంత్రి పదవి ఇచ్చేందుకు సీఎం సిద్దరామయ్య సుముఖత వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ప్రారంభంలోనే బీకే హరిప్రసాద్‌కు మంత్రి పదవి వస్తుందని భావించారు. అయితే ఆర్య ఈడిగ కోటాలో మధు బంగారప్పకు అవకాశం కల్పించారు. ప్రస్తుతం ఆయనను కేబినెట్‌నుంచి ఉద్వాసన పలికే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు బోసరాజును పక్కన పెడతారనే కథనాలతో బీకే హరిప్రసాద్‌కు కేబినెట్‌లో చోటు ఖాయమనిపిస్తోంది. వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతి వ్యవహారంలో సంబంధిత శాఖా మంత్రి నాగేంద్ర హస్తం ఉందనే ఆరోపణల మేరకు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దర్యాప్తు జరిపిన సిట్ పోలీసులు నాగేంద్ర పేరును ప్రస్తావించకుండానే చార్జ్‌షీట్ నమోదు చేసింది. కానీ ఇదే కేసును బ్యాంకు అధికారుల ఫిర్యాదుతో విచారణలు జరిపిన ఈడీ అధికారులు నాగేంద్ర అవినీతి సూత్రధారిగా చార్జ్‌షీట్‌లో పేర్కొంది. అయినా నాగేంద్రకు మంత్రి పదవి ఇస్తానంటూ స్వయంగా ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఇటీవలే బహిరంగంగా ప్రకటించారు. దీంతో మరోసారి నాగేంద్ర కేబినెట్‌లో చేరడం ఖాయమనిపిస్తోంది. 11 మంది మంత్రుల పనితీరు బాగాలేదనే నివేదికల నేపథ్యంలో ఆశావహులు ఎవరికి వారుగా ప్రయత్నాలు ముమ్మరం చేసుకుంటున్నారు. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌తో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ద్వారా కేబినెట్‌లో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది.



మధు బంగారప్ప



మునియప్ప




ఆర్‌బి తిమ్మప్ప



శరణ బసప్ప



సుధాకర్



బోసరాజు



రహీమ్ ఖాన్



శివానంద పాటిల్



వెంకటేశ్



డి. సుధాకర్

సాక్ష్యాలు తిరిగివ్వాలి..!

- హైకోర్టులో ప్రజ్వల్ రేవణ్ణ పిటిషన్.. కొట్టేసిన ధర్మాసనం



బెంగళూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కారు డ్రైవర్ మొబైల్ నుంచి పొందిన ఫొటోలు, వీడియోలు అన్నింటినీ సమర్పించేలా సిట్ అధికారులను ఆదేశించాలని అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ధర్మాసనం గురువారం కొట్టివేసింది. తనపై సమర్పించిన సాక్ష్యాల పట్ల అనుమానం ఉందని నిందితులతో పాటు అధికారులు సమర్పించిన అన్ని సాక్ష్యాలను ఇచ్చేలా ఆదేశించాలంటూ ప్రజ్వల్ పిటిషన్‌లో కోరారు. అయితే సదరు పిటిషన్‌పై న్యాయమూర్తి ఎం. నాగప్రసన్న నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. విచారణ వేళ చట్టాలను మార్చడం సాధ్యం కాదంటూ ధర్మాసనం తెలిపింది. మహిళల వ్యక్తిగతాన్ని గౌరవించడం కర్తవ్యమని, ఇతర మహిళల వ్యక్తిగతాన్ని ఉల్లంఘించేలాంటి వివరాలు మీకెందుకంటూ న్యాయమూర్తి మండిపడ్డారు. అంతా అశ్లీలంగా ఉందని అందుకు పరిమితి ఉండాలంటూ మందలిస్తూనే చట్టాలను మార్పు చేయడం సాధ్యం కాదన్నారు. ఇప్పటికే ప్రజ్వల్ కేసులో సిట్ అధికారులు చార్జ్‌షీట్ కూడా నమోదు చేశారు. ఇటీవలే విచారణకు తేదీలు ఖరారు చేసినా తాత్కాలికంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. ఇప్పటికే అన్ని ఫొటోలు, వీడియోలు ఇచ్చారని కేసును వాయిదా వేసేందుకు ఇలాంటి పిటిషన్‌లు దాఖలు చేస్తారంటూ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగదీష్ వాదించారు.

గన్ లైసెన్స్ ప్లీజ్..!

- ఆత్మరక్షణ కోసం తుపాకీ లైసెన్స్ కొనసాగించండి
- పోలీసులకు నటుడు దర్శన్ వినతి



బెంగళూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ రేణుకాస్వామి హత్య కేసులో నిందితుడిగా ఉన్న నటుడు దర్శన్ ఆత్మరక్షణ కోసం తుపాకీ లైసెన్స్‌టను కొనసాగించాలంటూ పోలీసులకు విన్నవించారు. హత్యకేసులో రెండో నిందితుడిగా ఉన్న దర్శన్‌ను అరెస్టు చేసిన పోలీసులు లైసన్స్ కలిగిన తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఆయన గన్ లైసెన్సును రద్దు చేయాలని పోలీసులు నిర్ధారించారు. దర్శన్ జైలులో ఆరు నెలల పాటు ఉండటంతో లైసెన్స్‌పై పోలీసులు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ ఇటీవలే దర్శన్ బెయిల్‌పై విడుదలయ్యారు. దీంతో తుపాకీ ద్వారా సాక్ష్యులను బెదిరించే అవకాశం ఉందని, మీకు సంబంధించిన తుపాకీ లైసన్సును ఎందుకు రద్దు చేయరాదంటూ ఈనెల 7న పోలీసులు దర్శన్‌కు నోటీసులు జారీ చేశారు. అందుకు సమాధానంగా దర్శన్ సమగ్రంగా వివరణ ఇచ్చారు. తాను సినిమా నటుడు అయినందున వెళ్ళిన ప్రతిచోటా ప్రజలు చేరుతారని ప్రైవేటు సెక్యూరిటీ ఉన్నా ఆత్మరక్షణకు లైసె న్సులు కావాలని రద్దు చేయకుండా పునరుద్ధరించాలని వినతిలో కోరుకున్నారు. తుపాకీ లైసెన్స్ రద్దు అవుతుందా, లేదా అనేది నగర పోలీసు కమిషనర్ తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంది.



లాల్‌బాగ్‌లో వాల్మీకి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న సీఎం సిద్దరామయ్య

పూల ప్రదర్శనతో సమాజానికి సందేశం

- లాల్‌బాగ్ ఫ్లవర్ షో ప్రారంభోత్సవంలో సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): లాల్‌బాగ్ ఉద్యానవనంలో ఏడాదికి రెండుసార్లు పూల ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రముఖులను, చారిత్రాత్మక ప్రదేశాలను పరిచయం చేస్తూ సమాజానికి కొత్త సందేశం అందించినట్లుగా ఉందని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రదర్శనలను గురువారం ముఖ్యమంత్రి లాంచనంగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఉద్యానవన కళాకారులు మహర్షి వాల్మీకి రూపాన్ని సుందరంగా రంగులమయం చేశారంటూ కొనియాడారు. అనంతరం ఆయన ఉద్యానవనంతో కలియతిరుగుతూ పూల సోయగాలను పరిశీలించారు. ఉద్యానవన శాఖా మంత్రి ఎస్ఎస్ మల్లికార్జునతో పాటు మంత్రులు జమీర్ అహ్మద్‌ఖాన్, రామలింగారెడ్డిలు ముఖ్యులుగా పాల్గొన్నారు. వాల్మీకి గురుపీఠం స్వామీజీలు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. సందర్శకులు విశేషంగా దర్శించి సెల్ఫీలతో హడావుడి చేశారు.

మాజీ ఎంపీ శ్రీనివాస్

కన్నుమూత



ఎం శ్రీనివాస్ (ఫైల్)

బెంగళూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): వయోభారం, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న కనకపుర మాజీ లోక్‌సభ సభ్యుడు, రాజరాజేశ్వరీనగర్ ఎమ్మెల్యేగా పని చేసిన ఎం శ్రీనివాస్ (83) కన్నుమూశారు. ఇటీవల అనారోగ్యంతో ఉండగా నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సలు ఫలించక గురువారం తుదిశ్వాస వీడారు. జయనగర్‌లో ఏడవ బ్లాక్‌లోని ఆయన నివాసం వద్ద అభిమానుల సందర్శన కోసం ఉంచారు. శుక్రవారం అంత్యక్రియలు వక్కలిగ సంప్రదాయ బద్ధంగా జరుపనున్నట్లు కుటుంబ సభ్యులు ప్రకటించారు. కనకపుర ఎంపీగా కొనసాగిన శ్రీనివాస్, బెంగళూరు ఉత్తరహళ్ళి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగానూ కొనసాగారు. ఆతర్వాత రాజరాజేశ్వరీనగర్ నుంచి కూడా ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అనంతరం ఎన్నికల్లో ఓటమి చెందడంతో రాజకీయాలకు దూరమయ్యారు. శ్రీనివాస్‌కు భార్యతో పాటు కుమారుడు వెంకటేష్ కుమార్తెలు, సోదరులతో పాటు అభిమానులు ఉన్నారు. శ్రీనివాస్ మృతి పట్ల మాజీ ప్రధాని దేవెగౌడ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, సీనియర్‌నేత యడియూరప్ప, సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్, కేంద్రమంత్రి కుమారస్వామితో పాటు ఆదిచుంచనగిరి మఠాధిపతి నిర్మలానందనాథస్వామీజీతో పాటు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

పరుగో..పరుగు..!

- బళ్లారిలో లోకాయుక్త తనిఖీలు
- కమిషనర్ కార్యాలయం, ఏపీఎంసీ, డంప్ యార్డు, ఆసుపత్రుల్లో సోదాలు
- అక్రమ కట్టడాలపై ప్రశ్నల వర్షం
- రైతుల నుంచి పదిశాతం పన్ను వసూళ్లపై నిలదీత
- బాలింతల మృతిపై ఆగ్రహం

బళ్లారి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): నగరంలో లోకాయుక్త అధికారుల ఆకస్మిక తనిఖీలతో ఆయా శాఖల అధికారులకు ముచ్చెమటలు పట్టాయి. ఉప లోకాయుక్త జస్టిస్ బి. వీరప్ప నేతృత్వంలో అధికారుల బృందం గురువారం బళ్లారిలో అధికారులను గడగడలాడించింది. ఏపీఎంసీ మార్కెట్ యార్డు, వీరాపురం వద్ద ఉన్న వేస్టేజి డంపింగ్ యార్డు, నగర పాలికె కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, కోర్టు, జిల్లా ఆసుపత్రి, బీఐఎంఎస్ ఆసుపత్రుల్లో సుడిగాలి పర్యటన చేసింది. తనిఖీ బృందం ఏ కార్యాలయానికి తనిఖీలకు వెళ్లేది బయటపెట్టకుండా ఆకస్మిక తనిఖీలు చేపట్టింది.

బళ్లారి నగర పాలికె కార్యాలయంలో..

బళ్లారి మహానగర పాలికె లో లోకాయుక్త అధికారులు అడిగిన ఏ ఒక్క ప్రశ్నకూ నగర కమిషనర్ ఖలీల్ స్పష్టంగా సమాధానం ఇవ్వలేక పోయారు. అక్రమ కట్టడాల పై ఎలాంటి చర్యలు తీసుకున్నారు.. ముందుగా ఏ విధమైన నోటీస్ ఇస్తారు. తర్వాత తీసుకునే చర్యలపై వారు ప్రశ్నించారు. బిల్డింగ్ ఫీజు, స్లాబ్ ధరలపై ఆరా తీశారు. సిబ్బంది రిజిస్టర్, రికార్డుల గది, ఇంజనీరింగ్ సెక్షన్‌లను పరిశీలించారు. ఫిర్యాదుల పరిష్కారంపై ప్రశ్నించారు. లోకాయుక్త అధికారి అడిగిన ఏఒక్క ప్రశ్నకూ నగర పాలికె కమిషనర్ ఖలీల్ బదులు ఇవ్వలేదు. దీంతో వీరికి నోటీసు జారీ చేశారు. కొందరి సిబ్బంది ఫోన్లు తీసుకుని ఫోన్‌పే లావాదేవీలపై ఆరా తీశారు.

ఏపీఎంసీలో..

లోకాయుక్త బృందం తొలుత ఏపీఎంసీలో తనిఖీలు చేసింది. రోజువారీ మార్కెట్‌కు వచ్చే సరుకుపై తనిఖీలు చేపట్టింది. రైతుల నుంచి 10 శాతం రాయితీ తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ డబ్బులు ఎందుకు వాడుతున్నారు. దాని ఖాతా ఏబ్యాంకులో ఉంది. అని నిలదీశారు. అలాగే రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కూరగాయలు, ఆకుకూరల మార్కెట్లలో వ్యాపారులతో మాట్లాడారు. సౌకర్యాలపై ఆరా తీశారు.

జిల్లా ఆసుపత్రి, బిమ్స్‌లో...

జిల్లా ఆసుపత్రిలో బాలింతల మరణంపై లోకాయుక్త ప్రశ్నించింది. అక్కడ వైద్యులు, రోగులతో మాట్లాడారు. సిబ్బంది. డాక్టర్లు, సౌకర్యాలు, తదితర వాటిపై విచారించారు. అనంతరం బీఐఎంఎస్‌లో రోగులను విచారించారు. బిమ్స్‌లో మందులు బయటకు ఎందుకు రాస్తున్నారని ప్రశ్నించారు. స్కానింగ్ రిపోర్టు మిషన్ నెలల తరబడి పని చేయకున్నా పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు.



డంప్ యార్డులో పర్యటిస్తున్న లోకాయుక్త బృందం

డంప్ యార్డు పరిశీలన

నగర సమీపంలోని వీరాపురం వద్ద ఉన్న వేస్టేజీ డంపును లోకాయుక్త బృందం పరిశీలించింది. వ్యర్థాలను తొలగించక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కోర్టులో పర్యటించారు. వివిధ కేసుల స్థితిగతులపై ఆరా తీశారు. ఇలా రోజంతా ఉపలోకాయుక్త అధికారులు నగరంలోని వివిద ప్రభుత్వ కార్యాలయాల్లో పర్యటించి అధికారులను పరుగులు పెట్టించారు. రోజంతా తనిఖీలతో అన్ని కార్యాలయాల్లోనూ సిబ్బందిలో దడ మొదలయ్యింది. పలు రికార్డులను జాగ్రత్తంగా ఉంచుకున్నారు. ఉప లోకాయుక్త అధికారి జస్టిస్ బి. వీరప్ప, కర్ణాటక లోకాయుక్త డిప్యూటీ కమిషనర్, కే.ఎం రాజశేఖర్, అసిస్టెంట్ కమిషనర్ శుభవీర్ భూన్. బళ్లారి లోకాయుక్త ఎస్పీ సి. సిద్దరాజు, డీవైఎస్పీ వసంత్ కుమార్, రిజిస్ట్రార్, సిబ్బంది పాల్గొన్నారు.



కార్పొరేషన్‌లో ఇంజనీర్‌ను విచారిస్తూ..



ఏపీఎంసీలో ఆహార నిల్వలను తనిఖీ చేస్తూ..

255 మంది అధికారులకు నోటీసులు

- రేపు విచారించనున్న ఉపలోకాయుక్త

బళ్లారి గాంధీనగర్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారుల పనితీరుపై జిల్లాలో 95 ఫిర్యాదులు నమోదు కాగా, వాటిని ఈ నెల 18వ తేదీన ఉప లోకాయుక్త అధికారి జస్టిస్ బి.వీరప్ప విచారించనున్నారు. వివిధ శాఖలకు చెందిన 255 మందిపై అధికారులు 95మంది లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. వీరందరికి జిల్లా లోకాయుక్త ఎస్పీ ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఈ నెల 18వ తేదీన జరగనున్న ఉప లోకాయుక్త విచారణలో నోటీసులు అందుకున్న అధికారులు, ఆయా శాఖల ప్రధాన అధికారులు విచారణకు హాజరు కావాల్సి ఉందని నోటీసులో సూచించారు. అన్ని కేసులు విచారణ జరపనున్న ఉప లోకాయుక్త అధికారి అదేరోజు ఆదేశాలు జారీ ఫిర్యాదులు పరిష్కరించనున్నట్లు సమాచారం. చాలా వరకు కేసులు ఇప్పటికే విచారణ జరిగాయి. ఇంకా కొన్నికేసులు విచారణ చేయాల్సి ఉంది. ఉప లోకాయుక్త అధికారి బళ్ళారి పర్యటన నేపథ్యంలో జిల్లా పాలనామండలికి చురుకు ముట్టినట్లు అయింది. లోకాయుక్త అధికారులు ఏ ప్రభుత్వ కార్యాలయానికి ఎపుడు వస్తారోనని అధికారుల గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నాయి. దీంతో రాత్రిపగలు తేడాలేకుండా ఆఫీసుల్లో ఫైళ్ళు సర్దేపనిలో నిమగ్నమయ్యారు. జిల్లాధికారి ఆధ్వర్యంలో ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి కార్యాలయాల్లో ఎలాంటి దోషాలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో క్రింది స్థాయి ఉద్యోగులు, సిబ్బందికి కార్యాలయం ముఖ్యస్తులు విశ్రాంతి లేకుండా పనులు చేయిస్తున్నారు. గురువారం ఉపలోకాయుక్త అధికారి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తెల్లవారుజామున బళ్ళారి ఏపీఎంసీ, జిల్లా ఆసుపత్రి, తాసీల్దారు కార్యాలయం, బళ్ళారి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ కళాశాల(బిమ్స్)లో రోగులకు అందుతున్న వైద్యసేవలు గురించి పర్యవేక్షించడం గమనార్హం. జిల్లాస్థాయిలో అధికారులు, ప్రజా ప్రతినిధులు అవినీతికి సంబంధించి 30 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు, ఇందులో 15ఏళ్ళ క్రితం నమోదైన కేసులు ఉన్నట్లు తెలిసింది. కొన్నికేసులకు సంబంధించి చార్జ్‌షీట్ వేసేందుకు సంబంధిత అధికారుల నుండి అనుమతి కోరినట్లు తెలిసింది. కొన్ని అభ్యర్థులు తిరస్కరించగా, కొన్ని అభ్యర్థలు మంజూరు చేసినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం. ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో ఒక ప్రశ్నకు ప్రభుత్వం ఇచ్చిన సమాధానంలో ఈ వాస్తవాలు వెలుగుచూశాయి కేసుల స్వరూపం భిన్నంగా ఉండడంతో 18న విచారణ జరగనుందని అధికారుల సమాచారం.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయమ్...

శ్రీకృష్ణదేవరాయలు (జయంతి)




విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయలు 1471 జనవరి 17న జన్మించారు. ఆయన పాలనలో విజయనగర సామ్రాజ్యం అత్యున్నతస్థితికి చేరుకుంది. దేశాన్ని పాలించిన గొప్ప చక్రవర్తులలు ఒకరిగా తెలుగు, కన్నడ ప్రజలు ఆయనను అభిమానిస్తారు. సాహిత్యంలో ఆంధ్రభోజుడిగా, కన్నడ రాజ్య రమారమణగా కీర్తించబడ్డారు. తెలుగులో ఆముక్తమాల్యద గ్రంథాన్ని రచించారు. కవి, పండితుడు కావడంతో సాహితీసమరాంగణ సార్వభౌముడు అని బిరుదు పొందారు. భువనవిజయంలో ఎనిమిది మంది కవులు అష్టదిగ్గజాలుగా పేరొందారు. గొప్ప రాజనీతిజ్ఞుడు, ఆర్థికవేత్త, కవిపోషకుడిగా రాణించారు. 1529 అక్టోబరు 17న కన్నుమూశారు.

ఎల్వీ ప్రసాద్ (జయంతి)



ఎల్వీ ప్రసాద్‌గా పేరొందిన అక్కినేని లక్ష్మీ వరప్రసాద్ రావు 1908 జనవరి 17న ఏలూరు తాలూకా సోమవరప్పాడు గ్రామంలో జన్మించారు. తెలుగు సినీ నిర్మాత, దర్శకుడు, నటుడు. హిందీ, తమిళ, తెలుగు, కన్నడ భాష లలో 50వరకు సినిమాలకు దర్శకుడిగా, నిర్మాతగా వ్యవహరించారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత. హిందీ, తమిళ, తెలుగు భాషలలో తొలి టాకీ చిత్రాలైన ఆలం ఆరా, కాళిదాసు, భక్త ప్రహ్లాద సినిమాలలో నటించిన ఘనత ఆయనది. హైదరాబాద్‌లో 1987లో లాభాపేక్ష లేని కంటి ఆసుపత్రి నెలకొల్పబడింది. ఇందుకుగాను 5 ఎకరాల స్థలం, ఇంకా భారీగా నగదు సమకూర్చడంతో ఆయన త్యాగానికి గుర్తుగా ఆసుపత్రికి ఆయన పేరును పెట్టారు. 1994 జూన్ 22న కన్నుమూశారు.

చాగంటి సోమయాజులు (జయంతి)




'చాసో'గా చిరపరిచితులైన చాగంటి సోమయాజులు 1915 జనవరి 17న శ్రీకాకుళంలో జన్మించారు. ఆయన తొలి రచన 'చిన్నాజీ' 1942లో భారతి అనే పత్రికలో ప్రచురితమైంది. ఆయన రచనల్లో ఎక్కువగా పీడిత ప్రజల బాధలు, సమస్యలు ప్రధానంగా ఉండేవి. చాలా కథలు, హిందీ, రష్యన్, కన్నడ, మరాఠీ, మళయాళం, ఉర్దూ భాషలలోకి అనువదించబడ్డాయి. 1968లో చాసో కథలుగా కథా సంకలనం వెలువడింది. కొండేపూడి సాహితీ సత్కారం అందుకున్నారు. 1994 జనవరి 1న కన్ను మూశారు. మరణానంతరం భౌతికకాయాన్ని మెడికల్ కాలేజీకి పరిశోధనల నిమిత్తం ఇచ్చేలా కోరడం ఆయన అభ్యుదయజీవన దృక్పథానికి నిదర్శనం.

ఎంజీఆర్ (జయంతి)



ఎంజీఆర్‌గా పేరొందిన మరుతూరు గోపాల రామచంద్రన్ 1917 జనవరి 17న జన్మించారు. తమిళ చలనచిత్ర నటుడు, రాజకీయ నాయకుడు. 1977-87ల మధ్య పదేళ్లపాటు తమిళనాడు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. గొప్పదాత, సమాజ సేవకుడు. డీఎంకేలో చేరి పలు హోదాలలో కొనసాగారు. కాలక్రమంలో అన్నాదురై మరణానంతరం మిత్రుడు కరుణానిధితో రాజకీయ విరోధం నెలకొని సొంతంగా అన్నాడీఎంకే పార్టీని స్థాపించి విజయం సాధించి ముఖ్యమంత్రిగా కొనసాగారు. 1987 డిసెంబరు 24న కన్ను మూశారు. మరణానంతరం భారతరత్న ప్రకటించారు.

మొహ్మద్ అలీ (జయంతి)



ప్రపంచప్రఖ్యాత బాక్సర్ మొహ్మద్ అలీ 1942 జనవరి 17న అమెరికా దేశం కెంటకీ ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు కాసియస్ మార్సెలస్ క్లే జూనియర్. పన్నెండో యేట నుంచి బాక్సింగ్‌లో శిక్షణ పొందారు. 1960లో బంగారుపతకం సాధించారు. తర్వాత ప్రొఫెషనల్‌గా 21 సంవత్సరాలపాటు బాక్సింగ్‌లో తిరుగులేని విజయాలను సాధించారు. 1964లో ఇస్లాం మతం స్వీకరించి మొహ్మద్‌అలీగా పేరు మార్చుకున్నారు. అప్పట్లో సైన్యంలో చేరి వియత్నాంపై యుద్ధం చేయాల్సి ఉండగా తాను నమ్మిన ఇస్లాం ప్రకారం అమాయకులను చంపనీయదని సైన్యంలో చేరేందుకు నిరాకరించాడు. దీంతో అమెరికా ప్రభుత్వం అతడి హెవీ వెయిట్ టైటిల్స్‌ను రద్దు చేసి జైలుకు పంపింది. చివరకు కోర్టును ఆశ్రయించడంతో అతడికి అనుకూలంగా తీర్పు వచ్చింది. 2016 జూన్ 3న మరణించారు.

జ్యోతిబసు (వర్ధంతి)



పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా వ్యవహరించి దేశంలో అత్యధికకాలం సీఎంగా కొనసాగిన రికార్డుల నెలకొల్పిన జ్యోతిబసు 1914 జూలై 8న కోల్కత్తాలో జన్మించారు. కమ్యూనిస్టు (మార్క్సిస్ట్) పార్టీకి చెందిన జ్యోతిబసు 1977 నుంచి వరుసగా ఐదుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. అంతకుముందు ఉపముఖ్యమంత్రిగా కొనసాగారు. సీపీఎం పోలిట్‌బ్యూరో నిర్ణయం వల్ల 1996లో ప్రధాని అయ్యే అవకాశం కోల్పోయారు. 2010 జనవరి 17న ఆయన కన్నుమూశారు.

జావేద్ అక్తర్ (పుట్టినరోజు)



ప్రముఖ సినీ గీత రచయిత జావేద్ అక్తర్ 1945 జనవరి 17న మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో జన్మించారు. స్క్రీన్ ప్లే రైటర్‌గా రాణించారు. 1999లో పద్మశ్రీ, 2007లో పద్మభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. 2023 జూలై 29న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్వంభర సినారె జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. జావేద్ అక్తర్ జీవితంపై రచయిత అరవింద్ మాండ్లోయ్ ముద్రించిన జాదూనామా పుస్తకాన్ని 2022 డిసెంబరు 4న ఉర్దూ ఫెయిర్ జష్న్ ఎ రేఖ్తాలో ఆవిష్కరించారు. 2010-16ల మధ్య రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు.

పూలషోయగం..!



అందాలను సెల్ ఫోన్‌లో బందిస్తున్న యువతి



నగరంలోని లాల్‌బాగ్‌లో గురువారం ప్రారంభమైన ఫ్లవర్ షోకు విశేష స్పందన లభించింది. సీఎం సిద్దరామయ్య ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం సందర్శకులకు అనుమతించారు. ఈ సందర్భంగా మహిళలు, యువకులు ప్రదర్శనను తిలకించి పూల సోయగాలను సెల్‌ఫోన్లలో బంధించారు. పలు చారిత్రక కట్టడాలు, ప్రముఖుల నమూనాల ముందు సెల్ఫీలు దిగుతూ విశేష అనుభూతి పొందారు.

-బెంగళూరు(ఆంధ్రజ్యోతి)





వాల్మీకి వనం ముందు సీఎం



పచ్చని కుటీరం





ఆకట్టుకుంటున్న ఆకృతులు



సీతారామ లక్ష్మణులు



పూల మందిరం



సీతమ్మ కుటీరం

వ్యాపారుల దోపిడీ

- కరివేపాకు రైతులకు దగా
- పంట కొని.. డబ్బు చెల్లించని వైనం
- అడిగితే బెదిరింపులు.. సెటిల్‌మెంట్లు
- రూ.15 కోట్లకుపైగా ఎగవేత



చింతకుంట వద్ద వ్యాపారులు రాక దున్నేసిన పంట

పుట్లూరు, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కరివేపాకు రైతులను కొందరు వ్యాపారులు నమ్మించి నట్టేట ముంచుతున్నారు. కష్టపడి పండించిన పంటను కోసుకువెళ్లి.. డబ్బులు ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారు. పుట్లూరు మండలంలో సుమారు 20 మంది రైతులకు రూ.15కోట్ల వరకూ ఎగవేశారు. పుట్లూరు మండలంలోని చింతకుంట, బాలాపురం, పుట్లూరు, పెద్దపప్పూరు మండలం శింగనగుట్టపల్లి, చాగల్లు, ఉల్లికల్లు, తాడిపత్రి మండలం యర్రగుంటపల్లి, రావివెంకటాంపల్లి, నార్పల మండలం నార్పల, మంగపట్నం తదితర గ్రామాల రైతులకు వ్యాపారులు భారీగా బకాయిలు ఉన్నారు. ఫోన్ చేసినా స్పందించడం లేదని, మరికొందరు బకాయి లేదని బెదిరిస్తున్నారని రైతులు వాపోతున్నారు.

నమ్మకంతో అమ్మకం

కరివేపాకు రైతులు అడ్వాన్స్ తీసుకోకుండా వ్యాపారులతో విక్రయ ఒప్పందాలు చేసుకుంటారు. టన్నుకు ఇంత ధర అని ముందుగానే మాట్లాడుకుంటారు. పంటను కోసేందుకు కూలీల ఖర్చు వ్యాపారులే పెట్టుకుంటారు. మార్కెట్‌లో పంట విక్రయించి, వారంలోగా డబ్బులు చెల్లిస్తామని నమ్మబలుకుతారు. ఆ తరువాత ఏళ్ల తరబడి డబ్బులు చెల్లించకుండా వేధిస్తున్నారు. బకాయి సొమ్ము అడిగితే.. 'బకాయి ఉన్నట్లు బాండ్ పేపర్లు ఉన్నాయా?' అని రైతులను దబాయిస్తున్నట్లు సమాచారం. గతంలో టన్ను కరివేపాకు రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకూ పలికింది. అప్పట్లో వ్యాపారులు గ్రామాలకు వచ్చి పంటను కోసుకువెళ్లారు. ఇతర రాష్ట్రాలకు తరలించి అమ్ముకున్నారు. కానీ రైతులకు పైసా చెల్లించకుండా మోసగించారు.

సెటిల్‌మెంట్లు.. బెదిరింపులు..

పంటను విక్రయించిన రైతులకు వ్యాపారులు చుక్కలు చూపిస్తున్నారు. ఒక్కో రైతుకు లక్షల్లో బకాయి ఉన్నా, ఫోన్‌లు ఎత్తడం లేదు. ఒకే రైతుకు ఇద్దరు వ్యాపారుల నుంచి రూ.39 లక్షలకు పైగా రావాల్సి ఉంది. మరో రైతుకు ఒకే వ్యాపారి నుంచి రూ.18 లక్షలు రావాల్సి ఉంది. బాధిత రైతు అడిగితే, తాను ఇబ్బందుల్లో ఉన్నానని, రూ.లక్షకు రూ.18వేల ప్రకారం ఇస్తానని ఒప్పుకున్నట్లు సమాచారం. తాడిపత్రి మండలంలోని ఓ గ్రామంలో రైతుకు రూ.20 లక్షలు రావాల్సి ఉండగా, రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పంచాయితీ పెట్టారు. తనకు నష్టం వచ్చిందని, అంత ఇవ్వలేనని చెప్పిన వ్యాపారి.. తక్కువ మొత్తం ఇచ్చేందుకు ఒప్పుకున్నట్లు తెలిసింది. బెంగళూరుకు చెందిన వ్యాపారులే ఎక్కువగా బకాయి ఉన్నారని సమాచారం. రైతులు ఫోన్ చేస్తే.. కొందరు వ్యాపారులు బెదిరిస్తున్నారని సమాచారం.

బెదిరిస్తున్నారు..

తొమ్మిది ఎకరాల్లో కరివేపాకు సాగుచేశాను. మూడేళ్లపాటు బెంగళూరుకు చెందిన ఇద్దరు వ్యాపారులకు విక్రయించాను. వారి నుంచి రూ.40 లక్షలు రావాల్సి ఉంది. ఏటా రూ.10 లక్షలకు గాను రూ.లక్ష ఇచ్చి కాలం గడుపుతున్నారు. బెంగళూరుకు చెందిన కాట్రాజ్, మంజు కంపెనీ యజమానులకు ఫోన్ చేస్తే నన్నే బెదిరిస్తున్నారు. బాకీ లేదని, డబ్బులు ఇవ్వాలంటే బాండ్లు తెచ్చుకోవాలని దబాయిస్తున్నారు. ఈ ఏడాది కూడా పంటను సాగుచేశాను. కానీ వ్యాపారులు రాక దున్నేశాను.

- జయరామిరెడ్డి, చింతకుంట



రూ.18 లక్షలు రావాలి..



ఐదెకరాలను కౌలుకు తీసుకుని కరివేపాకు పంటను సాగుచేస్తున్నాను. బెంగళూరుకు చెందిన ఒక వ్యక్తికి పంటను విక్రయించాను. రెండేళ్ల పంట డబ్బులు రూ.18లక్షల రావాల్సి ఉంది. అడిగితే అదిగో ఇదిగో అంటున్నారు. డబ్బులు ఇవ్వకపోతే ఎలా అని గట్టిగా దబాయిస్తే లక్షకు రూ.10వేలు ఇస్తానని చెబుతున్నాడు. ఆ డబ్బులతో అప్పులు సగం కూడా తీరవు. ఏం చేయాలో తోచడం లేదు. పంట సాగును విడిచిపెడదామని అనుకుంటున్నాను. ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

- నాగరంగయ్య, బాలాపురం

పరిష్కారమే లక్ష్యం..!

- 20 నుంచి భూముల రీ సర్వే
- ప్రతి మండలంలో ఒక గ్రామం
- వైసీపీ హయాంలో ఇష్టారాజ్యం
- మారిన భూ విస్తీర్ణం



ఫోన్ ఇన్‌లో భూసమస్యలు వింటున్న కలెక్టరు

అనంతపురం టౌన్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): భూముల రీ సర్వే కారణంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు మరో మారు సర్వే చేపడుతున్నారు. రైతుల నుంచి ఎక్కువ ఫిర్యాదులు వచ్చిన గ్రామాలకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. రీ సర్వే సమస్యలను తెలుసుకునేందుకు అధికారులు ఇప్పటికే గ్రామ సభలను నిర్వహించారు. అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వీటి ఆధారంగా ఈనెల 20 నుంచి రీ సర్వే ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది.

20వ తేదీ నుంచి..

జిల్లాలో ఈనెల 20 నుంచి రీసర్వేను ప్రయోగాత్మకంగా చేపడుతున్నారు. జిల్లాలో 31 మండలాలు ఉండగా, ఒక్కో మండలంలో ఒక్కో గ్రామాన్ని పైలెట్‌గా ఎంపిక చేశారు. రాయదుర్గంలో జుంజరంపల్లి, కణేకల్లు మీన్లహళ్లి, డి.హీరేహాళ్ మండలంలో కడలూరు, బొమ్మనహాళ్‌లో కురవపల్లి, గుమ్మఘట్ట మండల కేంద్రం, ఉరవకొండలో వ్యాసాపురం, వజ్రకరూరులో గంజికుంట, విడపనకల్లులో ఉండబండ, బెళుగుప్పలో తగ్గుపర్తి, కూడేరులో జయపురం, కళ్యాణదుర్గంలో దురదకుంట, బ్రహ్మసముద్రంలో గుండెగానిపల్లి, కుందుర్పిలో అపిలేపల్లి, కంబదూరులో తిమ్మాపురం, శెట్టూరులో అయ్యగార్లపల్లి, గుంతకల్లులో శంకరబండ, గుత్తిలో శ్రీపురం, పామిడిలో కాళాపురం, బుక్కరాయసముద్రంలో రెడ్డిపల్లి గార్లదిన్నెలో కల్లూరు, శింగనమలలో మట్లగొంది, నార్పలలో బొందలవాడ, యల్లనూరులో గాండ్లపాడు, పుట్లూరులో పాతపల్లి, తాడిపత్రిలో ఊరుచింతల, పెద్దపప్పూరులో చిన్నఎక్కలూరు, పెద్దవడుగూరులో దిమ్మగుడి, యాడికిలో చందన, అనంతపురం రూరల్‌లో తాటిచెర్ల, ఆత్మకూరులో సనప, రాప్తాడులో బండమీదపల్లి గ్రామాలను రీ సర్వేకి ఎంపిక చేశారు.

అన్నింటికీ పరిష్కారం

వైసీపీ హయాంలో భూముల రీ సర్వే చేపట్టారు. రైతుల అభిప్రాయాలను తీసుకోకుండా, ఇష్టారాజ్యంగా వ్యవహరించి, రికార్డులకు ఎక్కించారు. దీంతో చాలామంది రైతులు పూర్వం నుంచి సాగు చేసుకుంటున్న భూములను కోల్పోయారు. భూముల విస్తీర్ణం, సరిహద్దులలో తేడాలు వచ్చాయి. బాధిత రైతులు నెత్తీనోరు కొట్టుకున్నా వైసీపీ పాలకులు, అధికారులు పట్టించుకోలేదు. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే రీ సర్వేపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వీటి కోసం తొలుత ప్రత్యేక గ్రామసభలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా వేలల్లో ఫిర్యాదులు వచ్చాయి. ఇటీవల భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహించింది. ఆ సమయంలోనూ రీసర్వే సమస్యలపై వేలల్లోనే ఫిర్యాదులు వచ్చాయి. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 5 వేల వరకు ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో కొన్నింటిని ఇప్పటికే పరిష్కరించారు. సగానికి పైగా అలాగే ఉండిపోయాయని అధికారులు అంటున్నారు. రీ సర్వేతో ఆ సమస్యలు కూడా పరిష్కారమౌతాయని అంటున్నారు.

రేపు కర్ణాటక సంగీత కచేరి

అనంతపురం కల్చరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని విజయవాణి సంగీత కళాశాల ఆధ్వర్యంలో మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో శనివారం కర్ణాటక సంగీత కచేరీ నిర్వహిస్తున్నామని కళాశాల నిర్వాహకుడు మొదలి మురళీకృష్ణ గురువారం తెలిపారు. త్యాగరాజస్వామికి శనివారం ఉదయం 8 గంటలకు పంచామృతాభిషేకం, సంగీత విద్వాంసులచేత సామూహిక పంచరత్న గాన సేవలు ఉంటాయని తెలిపారు. అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు తమిళనాడుకు చెందిన అక్కచెల్లెళ్లు కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరీ నిర్వహిస్తామని తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1622.72	1,589.94
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	11,314	0
నీటి నిల్వ (టీఎంసీలు)	69.32	10.17

ఘనంగా సిద్దరామేశ్వర జయంతి



సిద్దరామేశ్వర చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

సిరుగుప్ప, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సిద్ద రామేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని హైస్కూలు గ్రౌండ్ నుంచి టిప్పుసుల్తాన్ సర్కిల్ వరకు సిద్దరామేశ్వర భావచిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప పూజలు జరిపి ఊరేగింపును ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విశ్వనాథ్, భోవి సమాజ అధ్యక్షుడు హాలప్ప, నటరాజ, ప్రముఖులు ఉలిగప్ప, తాలుకా సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ సిద్దయ్య పాల్గొన్నారు.

ఉద్యోగమేళాను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న రాజశేఖర్

కంప్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సండూరులో 19వ తేదీన మంత్రి సంతోష్‌లాడ్ ఆధ్వర్యంలో జరిగే ఉద్యోగమేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పట్టణ నాయకుడు వి.రాజశేఖర్ పిలుపునిచ్చారు. సంతోష్‌లాడ్, ఈ తుకారామ్, అన్నపూర్ణ పేద ప్రజలను దృష్టిలో వుంచుకుని నిరుద్యోగుల కోసం ఈ ఉద్యోగ మేళా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 4 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం వుంటుందని తెలిపారు. ఇప్పటికే 50 సంస్థలు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వస్తున్నట్లు తెలిపారు.

బైకును ఢీకొన్న లారీ..

ఒకరికి గాయాలు



లారీ వద్ద గుమిగూడిన జనం

బళ్లారి రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): నగరంలో గురువారం ఉదయం అల్లం భవన్ సమీపంలో బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు మహమ్మద్ అనే వ్యక్తి ఉదయాన్నే తన పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. బైక్‌పై వెళుతున్న మహమ్మద్ లారీ కింద భాగంలో అరగంటపాటు ఇరుక్కుపోయాడు. అతనిని క్రేన్ సాయంతో లారీ కింద బయటకుతీసి 108లో బళ్లారి విమ్స్ ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



హెచ్చరిక బోర్డులను పరిశీలిస్తున్న ఎస్పీ పుట్టమాదయ్య

రాయచూరు జనవరి 16(ఆంధ్రజ్యోతి): నగర సమీపంలో హైదరాబాద్ జాతీయ రహదారిపై ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు ప్రమాద నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను గురువారం రోడ్డు రవాణా, హైవే అథారిటీ అధికారులతో కలిసి ఎస్పీ పుట్టమాదయ్య పరిశీలించారు. నగర సమీపం యరమరస్ క్రాస్‌తో పాటు ఇటీవల బైపాస్ రోడ్డు వద్ద పలు ప్రమాదాలు జరిగిన ప్రాంతాల్లో బోర్డులు ఏర్పాటు చేశారు.

అత్యాచార కేసు నిందితుడిపై కాల్పులు

- పోలీసులపై దాడికి యత్నం • కాలికి బుల్లెట్ గాయం

బళ్లారి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల బాలికపై అత్యాచారం చేసి పరారీలో ఉన్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. పోలీసులపై దాడిచేసి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. పోలీసులు పట్టుకునేందుకు ఎంత ప్రయత్నించినా వారిపైనే దాడికి తెగబడ్డాడు. దీంతో పోలీసులు అతనిపై కాల్పులు జరపగా కాలుకు బుల్లెట్ గాయమైంది. వెంటనే అతన్ని బళ్లారి విమ్స్ అసుపత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. ఘటనపై బళ్లారి ఎస్పీ శోభారాణి తెలిపిన మేరకు సండూరు తాలూకా తోరణగల్లులో ఓ ఇంట్లో చిన్నారి రోజూ ఆడుకుంటుండేది. ఎదురుగా ఉన్న దుకాణం వద్ద మంజునాథ అనే వ్యక్తి ఆ పాపను గమనిస్తుండేవాడు. ఈ క్రమంలో 13వ తేదీన ఆ పాపను కొద్దిదూరం తీసుకుపోయి మంజునాథ అత్యాచారం చేసి పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కొప్పళ జిల్లా హులిగి వద్ద నిందితుడిని పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఆ వ్యక్తిని పోలీసులు పంచనామా చేశారు. మూత్రం వస్తోందని పోలీసులకు తెలిపాడు. ఇద్దరు పోలీసులు అతని వెంట వెళ్లారు. అదును చూసి పోలీసులపై మంజునాథ తిరగబడ్డాడు. ఒక కానిస్టేబుల్ కడుపు, ముఖంపై గుద్దాడు. అక్కడే ఉన్న మరికొంతమంది కానిస్టేబుళ్లు పట్టుకునేందుకు ప్రయత్నించారు. వారి మాట వినకుండా తప్పించుకుని పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు ముందు గాలిలోకి ఒక రౌండ్ కాల్పులు జరిపారు. అయినా లెక్కచేయకుండా పారిపోతున్న సమయంలో అతని కుడికాలు భాగంలో పోలీసులు కాల్చారు. అతనిని వెంటనే విమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. రంగనాథ చేతిలో గాయపడ్డ కానిస్టేబుల్ రఘుపతి గుండె భాగంలో నొప్పిగా ఉండటంతో విమ్స్‌లో వైద్యం అందిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఏఎస్పీ రవికుమార్, నవీన్‌కుమార్ నేతృత్వంలో తోరణగల్లు డీఎస్పీ ప్రసాద్ గోకలే. మహేశ్వరగౌడ, పోలీసుల బృందం నిందితుడిని పట్టుకున్నట్లు తెలిపారు.



ఆస్పతిలో చికిత్స పొందుతున్న నిందితుడిని పరిశీలిస్తున్న ఎస్పీ



దాడిలో గాయపడిన కానిస్టేబుల్ రఘుపతి

బహుముఖ నటుడు బళ్లారి రాఘవ

బళ్లారి సిటీ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): బహుముఖ నటుడు బళ్లారి రాఘవ అని కళాకారుడు సిద్దరామ కల్మఠ అన్నారు. నగరంలోని ప్రభుత్వ కళాశాల(మున్సిపల్) తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాట్య కళాప్రపూర్ణ బళ్లారి రాఘవాచార్య అని కొనియాడారు. ప్రఖ్యాత నాటక రచయిత జార్జ్ బెర్నార్డ్ షాను కలిసి పాశ్చాత్య రంగస్థలం గురించి రాఘవ చర్చించారన్నారు. మూఢ నమ్మకాలతో కూడిన అంటరానితనాన్ని, సమాజంలోని లోపాలను అధిగమించేందుకు రాఘవ ప్రయత్నించారని అన్నారు. వివిధ బాషల్లో 60 నాటకాల్లో నటించారని అన్నారు. సారంగధర, కబీర, హిరణ్యకశ్యప, శివాజీ, చాణక్యుడు, హరిశ్చంద్ర, కర్ణ, హ్యామ్లెట్ తదితర విభిన్నమైన పాత్రలు పోషించి నాటకరంగానికి ఎనలేని కృషి చేశారన్నారు. రాఘవ స్మారక సంఘం గౌరవాధ్యక్షుడు చెన్నప్ప మాట్లాడుతూ రాఘవ నటించని పాత్ర లేదన్నారు. కార్యక్రమంలో రాఘవ మెమోరియల్ అసోసియేషన్ కార్యదర్శి ప్రకాశ్, బసవరాజు, నాగేశ్వరరావు, సుంకప్ప, ప్రభాకర్, శివేశ్వర్‌గౌడ్, మల్లికార్జున, తిమ్మప్ప, హనుమంతరావు, నాగిరెడ్డి పాల్గొన్నారు.



ప్రముఖులను సన్మానిస్తున్న దృశ్యం

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం



మాట్లాడుతున్న తహసీల్దార్ విశ్వనాథ్

సిరుగుప్ప, జనవరి 16(ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని తహసీల్దార్ విశ్వనాథ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు నిర్వహించడంపై ప్రభుత్వాధికారులు, వివిధ సంఘ సంస్థల పదాధికారులతో పూర్వాపరాల సిద్దత సమావేశాన్ని నిర్వహించారు. 26న ఉదయం 9 గంటలకు జాతీయ జెండా ఎగురవేయడం, స్కౌట్స్ అండ్ గైడ్స్, సాంస్కృతిక ప్రదర్శనలు, విద్యార్థులను హైస్కూలు గ్రౌండ్‌లో చేర్చడంపై చర్చించారు. ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారి గురప్ప, తాలుకా సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ సిద్దయ్య, బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ గాదిలింగప్ప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాయచూరు: జిల్లా కేంద్రంలోని మహాత్మగాంధీ స్టేడియంలో 26వ తేదీన నిర్వహించే గణతంత్ర వేడుకలను పకడ్బందీగా నిర్వహించాలని అసిస్టెంట్ కలెక్టర్ శివానంద భజంత్రి అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి గురువారం జిల్లాధికారి కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్ జాతీయ జెండాను ఎగురవేస్తారన్నారు. పోలీస్ పరేడ్ మైదానంలో స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌సీసీ విద్యార్థులు నిర్వహించే కవాతులకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు.



రాయచూరులో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ శివానంద

ఎంఎస్‌పీపై ఆసక్తి చూపని రైతులు

- ప్రైవేటు వ్యాపారుల వద్దే వరి ధాన్యం విక్రయం

బళ్లారి గాంధీనగర్/బళ్లారి సిటీ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కనీస మద్దతు ధర పథకం (ఎంఎస్‌పీ) కింద వరిధాన్యం ప్రభుత్వానికి విక్రయించేందుకు జిల్లా రైతలు విముఖత చూపుతున్నారు. ఇప్పటి వరకు కేవలం 34 మంది రైతులు మాత్రమే తమ పేర్లు చేసుకోగా, ఎక్కువ మంది ప్రైవేటు వ్యక్తులకు అమ్మేందుకే ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో రైతుల నుంచి వరి, మినుము, మొక్కజొన్న పంటలను ఎంఎస్‌పీ కింద కొనుగోలు చేసేందుకు జిల్లాలో ఏడు కేంద్రాలను ప్రారంభించారు. నవంబరు 11 వరకు పంటల నమోదు ప్రక్రియ సాగింది. సాధారణ వరి పంటకు రూ.2,300(క్వింటాల్‌కు) గ్రేడ్-ఏ వరికి రూ.2,300, మినుములు క్వింటాల్‌కు రూ.4,290, హైబ్రిడ్ జొన్నకు రూ.3,371, మల్దండి తెల్లజొన్న క్వింటాల్‌కు రూ3,421 ప్రభుత్వం ధర నిర్ణయించినా రైతులు అమ్మేందుకు ముందుకు రావడం లేదు. జిల్లాలో ఈ ఏడాది లక్ష హెక్టార్ల వరి సాగు అయ్యింది. ఎకరాకు సారసరి 35 నుంచి 38 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలకు మాత్రం రైతులు రావడం లేదు. ఇప్పటి వరకు కేవలం 34మంది రైతులు మాత్రమే 1,582 క్వింటాళ వరి ధాన్యం విక్రయించినట్లు అధికారులు చెబుతున్నారు. కొనుగోళ్లు మందగతిన సాగడం, ఖరీదుకు పరిమితి విధించడం, రైతులే ఖరీదు కేంద్రాల వద్దకు వెళ్లి నమోదు చేయించాలంటే ఖర్చులు ఎక్కువవుతున్నాయని అంటున్నారు. అదే ప్రైవేటు వ్యక్తులు పొలం వద్దకే వచ్చి వరిని కొనుగోలు చేస్తున్నట్లు రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. జిల్లాలో రైతు మిల్లర్లు, దళారీలు పొలాల వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. ధర తక్కువగా ఉన్నా ఎంఎస్‌పీ కేంద్రాల వద్దకు వెళ్లేందుకు, కూలీల ఖర్చు మిగులుతుందనే ఉద్దేశ్యంతోనే కొనుగోలు కేంద్రాలకు రైతులు రావడం లేదని ఆహార పౌరసరఫరాల అధికారులు చెబుతున్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే బళ్కారిలో వరి కొనుగోలు కేంద్రాలు తక్కువ ఉన్నాయని, కేంద్రాల్లో నియమనిబంధనలు కారణంగా రైతులు కొనుగోలు కేంద్రాల వైపు మొగ్గుచూడం లేదనేది రైతు సంఘాల నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు.



కొనుగోలు దారుల కోసం పొలం వద్ద ఎదురు చూస్తున్న మహిళా రైతు



మండపాలకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

హంపిలో మండపాల పునరుద్ధరణ

బళ్లారి సిటీ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): విజయగనగరం జిల్లా హంపి విరూపాక్ష దేవాలయంలోని రెండు ముఖ మండపాలు 2024మే 21న కూలిపోయిన సంగతి తెలిసిందే. వాటిని పునరుద్ధరణ పనులు ఎట్టకేలకు చివరి దశకు చేరుకున్నాయి. అక్టోబరు వరకు వర్షం కారణంగా పనులు ప్రారంభం కాలేదు. అనంతరం ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) నిపుణుడు ఇంజనీర్ ధరణీధరన్ నేతృత్వంలో బృందం ఏర్పడింది. మంటపాలను మునుపటిలాగా తీర్చిదిద్దుతున్నారు. మండపాల వరుసల మధ్య కొన్ని మండపాలు శిధిలావస్థ చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటిని త్వరగా పునరుద్ధరించాలని పర్యాటకులు కోరుతున్నారు.

సదుపాయాలు కల్పించండి

- ప్రజాసంఘాల నాయకుల వినతి



పురసభ అధ్యక్షుడు కల్లుడప్పకు వినతిపత్రం ఇస్తున్న సంఘాల నాయకులు

తోరణగల్లు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సండూరు తాలూకా కురేకుప్పలో మౌలిక సదుపాయాలు కల్పించాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు మాట్లాడుతూ కురేకుప్ప పంచాయతీ నుంచి పురసభగా మారి దశాబ్దం గడిచినా సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు. జనాభా పెరిగినా అందుకు తగ్గట్లు మౌలిక సదుపాయాల గురించి అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అండర్ డ్రైనేజీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఏపీఎంసీ మార్కెట్ వసతి, శుద్ధినీటి వ్యవస్థ లేవన్నారు. ఈ ప్రాంతంలో పౌరకార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. వీటిపై ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పురసభ అధ్యక్షుడు కల్లుడప్ప, ఇతర అధికారులకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో వివిధసంఘాల నాయకులు దేవన్న, పంపన్నగౌడ, సత్యన్న, దేవదాసి విమోచన సంఘం పదాధికారి స్వామి, మహిళలు, కార్మికులు పాల్గొన్నారు.

సెంట్రల్ బస్టాండ్ పరిశీలన



బస్టాండ్‌లోని హోటల్‌లో పరిశీలిస్తున్న చిదానందప్ప

బళ్లారి సిటీ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా హామీ పథకాల అమలు అథారిటీ చైర్మన్ కేఈ చిదానందప్ప నగరంలోని సెంట్రల్ బస్టాండ్‌ను గురువారం పరిశీలించారు. అక్కడి పరిశుభ్రత, తాగునీరు, మౌలిక వసతులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. మహిళా ప్రయాణికులతో మాట్లాడి శక్తి యోజన అమలుపై వివరాలు సేకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శక్తి యోజన మహిళా సాధికారిత దిశగా సాగుతుండడంతో ఎలాంటి సందేహం లేదని, అయితే ఇదే సమయంలో విద్యార్థులు, ఇతర ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బళ్లారి తాలూకా హామీ పథకాల అమలు కమిటీ చైర్మన్ నాగభూషణ్‌గౌడ్, డిప్యూటీ ట్రాఫిక్ కంట్రోల్ అధికారి, చామరసా డిపో మేనేజర్ గంగాధర్ పాల్గొన్నారు.

కల్తీకల్లు స్థావరంపై దాడి

రాయచూరు జనవరి 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని మంగళవారిపేటలో పెద్ద ఎత్తున అక్రమంగా తయారు చేస్తున్న కల్తీకల్లు స్థావరంపై ఎక్సైజ్ అధికారులు గురువారం దాడి చేశారు. గత కొంతకాలంగా కాలనీలో పెద్ద ఎత్తున కల్తీకల్లు తయారుచేసి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు దాడి నిర్వహించారు. 300 లీటర్‌లకుపైగా అక్రమంగా నిల్వ ఉంచిన కల్తీకల్లును స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు బాధ్యులుగా రవి, మారెప్ప తదితర ముగ్గురిని అరెస్టు చేసి పోలీసులకు అప్పగించారు.

ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

కంప్లి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): తాలుకా సమీపంలోని బండెట్టి, వడ్డు, తాళూరు గ్రామాల్లో సమాజసేవకులు ముగ్గుల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. సమాజసేవకులు విద్య, కీర్తి, సునీత, మధు, వీణ మాట్లాడుతూ మహిళలు సంప్రదాయాలు మరువరాదన్నారు. ప్రతి మహిళ ముందుగా ఇళ్ల ముందు ముగ్గులు వేసే అలవాటు నేర్చుకోవాలన్నారు. తాళూరులో కరిబసమ్మ, వందన, రుద్రమ్మ, ఈరమ్మలకు బహుమతులు అందజేశారు. వడ్డు గ్రామంలో జయశ్రీ, ఆదిలక్ష్మీ, అనితలకు, బండెట్టిలో పార్వతి, సునీత, విజయలక్ష్మికి బహుమతులను అందజేశారు.

అదుపు తప్పిన కారు

గాండ్లపెంట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరి, రాయచోటి ప్రధాన రహదారిలోని రెక్కమాను వద్ద ఓ కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని గురువారం ఢీకొంది. కదిరి సమీపంలోని మూర్తిపల్లికు చెందిన ఓ వ్యక్తి కారులో గాలివీడుకు బయలుదేరాడు. రెక్కమాను వద్ద రోడ్డు మరమ్మతులు జరుగుతున్నాయి. గమనించని అతని కారులో అతివేగంగా వెళ్లడంతో ఆ వాహనం అదుపు తప్పింది. రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని కొద్ది దూరంలో ఆగిపోయింది. ఆ వ్యక్తి ప్రమాదం నుంచి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఆ విద్యుత్ స్తంభం విరిగి.. పూర్తిగా వంగింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బత్తలపల్లి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాపురం వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో తాడిమర్రికి చెందిన రాము తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం అతను బైక్‌పై రాళ్ల అనంతపురం వెళ్లాడు. తిరిగి వస్తుండగా రామాపురం వద్ద కర్ణాటకకు చెందిన అభిషేక్ అనే వ్యక్తి రాయచోటికి కారులో వెళ్తూ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న రాము తీవ్రంగా గాయపడటంతో స్థానికులు అతన్ని 108లో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆసు పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉందని ఎస్ఐ తెలిపారు.

హోసూరు జోన్

బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్థుల వినతి

హోసూరు జనవరి 16(ఆంధ్రజ్యోతి): కెలవరపల్లి సమీపం దక్షిణ పినాకిని నదిపై బ్రిడ్జి నిర్మించాలని ఆ ప్రాంత ప్రజలు కోరారు. కెలవరపల్లి నది ప్రాంతంలో నీటి ప్రవాహం పెరిగిందన్నారు. హోసూరు-నందిమంగళం రహదారిపై దక్షిణ పినాకిని చుట్టూ తట్టనపల్లి కాలిబాట వంతెనపై 10 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. తప్పని పరిస్థితుల్లో నిత్యావసరాల కోసం బాగలూరు, ముత్తాళి మీదుగా వెళుతున్నామన్నారు. ఆస్పత్రులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి నదిపై వంతెనను నిర్మించి తమ కష్టాలు తీర్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

బళ్లారి రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని 34వ వార్డు విద్యానగర్ 6వ క్రాస్ శాంతినగర్‌లో తాగునీటి పైపులైన్‌కు గురువారం ఆ వార్డు కార్పొరేటర్, మాజీ మేయర్ రాజేశ్వరి సుబ్బరాయుడు భూమి భూమి చేశారు. కార్యక్రమంలో అయాజ్ అహ్మద్, బోయపాటి విష్ణువర్ధన్, శ్రీనాథ్, తిమ్మప్ప, యర్రిస్వామి, ప్రకాష్, లింగన్న, కోటిలింగ, యోగానంద రెడ్డి, గాదెలింగ పాల్గొన్నారు.



మాజీ మేయర్‌ను సన్మానించిన దృశ్యం



ఎద్దులను పట్టుకుంటున్న యువత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై. ప్రకాశ్

ఆకట్టుకున్న ఎద్దుల పరుష

హోసూరు జనవరి 16(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని గోపసంద్రం గ్రామంలో పొంగల్ పండుగ సందర్భంగా నిర్వహించిన సంప్రదాయ ఎద్దుల పరుష అందరినీ ఆకట్టుకుంది. గతంలో ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఎద్దులకు వైద్య పరీక్షలు కూడా నిర్వహించారు. ప్రముఖుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి పరుషను ప్రారంభించారు. తమిళనాడులో మాత్రమే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా ఎద్దులు పాల్గొనాయి. 1000కి పైగా ఎద్దులు పాల్గొన్నాయి. రంగురంగుల బెలూన్లు, దుస్తులు, జెండాలతో ఎద్దులను, బండ్లను తీర్చి తిద్దారు, అనంతరం ఎద్దుల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వై. ప్రకాశ్ పాల్గొన్నారు. యూత్ ఫెడరేషన్ శ్రీనివాసన్, వీరారెడ్డి, భాగ్యరాజు, కృష్ణమూర్తి, డీఎంకే పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొంగల్ సంబరం

హోసూరు జనవరి 16(ఆంధ్రజ్యోతి): హోసూరు బాగలూరు రోడ్డులోని సమత్వ పురం ప్రాంత ప్రజలు గురువారం పొంగల్‌ను కలిసికట్టుగా జరుపుకున్నారు. పండుగ నాలుగు రోజుల తరువాత ఇక్కడ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ముందుగా పశువులను తీసుకొచ్చి పూజలు చేసి అనంతరం అన్ని మతాల ప్రజలు పొంగల్‌ను జరుపుకున్నారు. పాఠశాల విద్యార్థులకు, బాలికలకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



పండుగ చేసుకుంటున్న ప్రజలు